క్లుప్తంగా

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


రంగు రంగు ముగ్గులు వేస్తున్న మహిళలు

గుంతకల్లు: వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక సత్యనారాయణపేటలోని రామలింగ కాంప్లెక్స్ వద్ద కమిటీ కుర్రోళ్ల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్, హ్యాండ్ బాల్ తదితర విభాగాల్లో జాతీయ స్థాయిలో రాణించిన దాదాపు 28 మంది క్రీడాకారులకు ధ్రువపత్రాలతోపాటు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోపాల్, ఫిజికల్ డైరెక్టర్ మహబుబ్‌బాషా, అధ్యాపకులు వెంకటరమణ, శివయ్య, డాక్టర్ నాగర్జున, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలకు చర్యలు తీసుకోండి

బుక్కరాయసముద్రం: బాల్య వివాహాల నిర్మూలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని హ్యూమర్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర డిఫెండర్ కరుణాకర్ కోరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కరుణాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు పెరిగుతున్నాయన్నారు. వాటిని అరికట్టడంలో అధికారలు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇటీవల సంజీవపురానికి చెందిన బాలికలను వైఎస్సార్ జిల్లాలో ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారన్నారు. వీటికి బీకే ఎస్ పోలీసులు కూడా సహకరించారని ఆయన ఆరోపించారు. బాల్య వివాహంపై జిల్లా ఉన్నత అధికారులకు పిర్యాదు చేశామన్నారు.

మహాగణపతి సహస్ర కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

గుంతకల్లు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో మూడో రోజు మహగణపతి సహస్ర కుంకుమార్చన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అవోపా వినాయక ఉత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెంగుళూరుకు చెందిన ప్రముఖ గాయకులు వాసవీ సిస్టర్స్ నాగమణి, మనోహర్ పాల్గొన్నారు. వేదపండితులు ఆధ్వర్యంలో మహగణపతి సహస్ర కుంకుమార్చన కార్యక్రమంలో వందలాది మంది ఆర్య వైశ్య మహిళలు పాల్గొన్నారు. అవోపా వినాయక ఉత్సవ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇనుగూరు శంకరనారాయణ గుప్తా, పువ్వాడి శ్రీనివాసులు, కోశాధికారి ఎస్ఎంకే లక్ష్మీనారాయణ, నాయకులు మిట్టా యస్,లో కేంద్రనాథ్, జయంతి వెంకట్, ఇనుగూరు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'సంపద తయారీ కేంద్రం' తనిఖీ

పుట్లూరు: మండలకేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ష్రెడర్ చేయు విధానాన్ని అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం సభ్యుడు రామచంద్ర శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చెత్త నుంచి సంపద తయారీ తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, పంచాయతీ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ క్రికెట్ టోర్నీకి ఎంపిక


జయంత్ కృష్ణ

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రిలయన్స్ క్రికెట్ ట్రోఫీలో జిల్లాకు చెందిన జయంత్ కృష్ణకు చోటు దక్కింది. గుజరాత్‌లోని అహమ్మదాబాద్ వేదికగా ఈ నెల 30 నుంచి రిలయన్స్ కప్ మల్టీడే క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో తాడిపత్రికి చెందిన జయంత్ కృష్ణకు దక్కడంపై జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి వి.భీమలింగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మెరిసిన గిరిజన యువత

- టీచర్, పోలీస్, బ్యాంక్ ఉద్యోగాలకు ఎంపిక
- పులగుట్టపల్లి పెద్దతండా రైతు బిడ్డల ప్రతిభ

ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గుంతకల్లు మండలంలోని పులగుట్టపల్లికి చెందిన గిరిజన యువత సత్తా చాటారు. గ్రామానికి చెందిన జ్యోతిబాయి, రాజేష్ నాయక్ డీఎస్సీలో మెరిట్ సాధించి టీచర్ ఉద్యోగాలు సాధించగా.. శ్రీనినాయక్ గ్రామీణ బ్యాంకులో క్లర్క్ పోస్టు, రాఘవ నాయక్ ఏపీ సివిల్ కానిస్టేబుల్ పోస్టు దక్కించుకున్నారు. వారిని గ్రామస్తులు అభినందించారు. – గుంతకల్లు:

సోదరుల బాటలో..


రాజేష్ నాయక్

రైతు బి.మునినాయక్‌కు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు బ్యాంకు ఉద్యోగి, రెండో కుమారుడు గుంతకల్లు మండల ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. దీంతో తాను కూడా ఎలాగైనా సోదరుల్లాగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదువుకున్నాడు..డీఎస్సీ కోసం రోజూ దాదాపు 7 నుంచి 8 గంటలు చదివాడు. కష్టానికి ఫలితం దక్కింది. ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికై ఆదర్శంగా నిలిచాడు.

నాన్న మృతి చెందినా..


శ్రీనివాసులు నాయక్

భర్త రామేల్ నాయక్ చనిపోవడంతో జయమ్మ తన ముగ్గురు సంతానాన్ని కూలి పని చేసుకుంటూ పోషించుకుంటోంది. చిన్న కూమారుడు శ్రీనివాసులునాయక్ గుంతకల్లులోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తూ తల్లికి చేదుడువాదోడుగా ఉండేవాడు. అయితే గ్రామీణ బ్యాంకులో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో నంద్యాలలో బ్యాంకు కోచింగ్ తీసుకున్నాడు. క్లర్క్ పోస్టుకు సాధించి తల్లి పడిన కష్టానికి జాబ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చాడు.


పులగుట్టపల్లి పెద్దతండా ముఖచిత్రం

నాలుగు జిల్లాలకు ఉన్న ఒక్క పోస్టు దక్కించుకున్నా..



రాయలసీమ జోన్‌లోని నాలుగు జిల్లాలకు ఎస్టీ మహిళా కేటగిరి కింద ఉన్న ఒక్క పోస్టు దక్కించుకోవడం గర్వంగా ఉంది. మా తల్లి దండ్రులు కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. గత 12 ఏళ్లుగా కర్నూలు జిల్లా చిప్పగిరి కేజీబీవీలో సోషల్ టీచర్‌గా కాంట్రాక్ట్ కింద పని చేశాను. భర్త ఎన్.గోవింద్ నాయక్ సహాయంతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన తరువాత రోజు నుంచి గంటల తరబడి పట్టుదలతో చదువుకున్నా. ఫలితాలు అనంతరం ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికవడంతో ఆనందంగా ఉంది

– ఎన్.జ్యోతిబాయి, పులగుట్టపల్లిపెద్ద తండా

పోలీస్ కావడమే లక్ష్యంగా..


రాఘవనాయక్

జి.మూనే నాయక్, దేవమ్మ దంపతులు కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి నలుగురు సంతానం. పెద్దవాడు రాఘవనాయక్ పోలీస్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగాడు. తల్లిదండ్రుల తోపాటు కూలి పనులకు కూడా వెళ్లేవాడు. ఇటీవల విడుదలైన పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో 147 మార్కులు సాధించి జనరల్ కేటగిరిలో సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యాడు. దీంతో అతడిని గ్రామస్తులు అభినందించారు.

కష్టపడ్డారు.. కొలువుకు ఎంపికయ్యారు


సుధ


కృష్ణ

పామిడి: ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో పామిడి మండలానికి చెందిన ఇద్దరికి ఉపాధ్యాయ పోస్టులు లభించాయి. పామిడికి చెందిన సుధా ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైంది. అలాగే మండలంలోని కట్టకిందపల్లికి చెందిన కృష్ణ స్కూల్ అసిస్టెంట్(సోషల్) ఉద్యోగం సాధించాడు. అలాగే మండలంలోని వంకరాజుకాలువ గ్రామానికి చెందిన నరసింహ పీడీ పోస్టుకు ఎంపికయ్యారు. వారిని పలువురు అభినందలతో ముంచెత్తారు.

వైఎస్సార్‌సీపీ 'అనుబంధ' అధ్యక్షుల నియామకం



శింగనమల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలు, బుక్కరాయసముద్రం మండల కమిటీ, అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్నం ఫణీంద్ర, నియోజకవర్గ పబ్లిక్ వింగ్ అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా పి.ఓబిరెడ్డి నియామకం అయ్యారు. అలాగే బుక్కరాయసముద్రం మండల ఉపాధ్యక్షులుగా ఎస్.సాంబశివారెడ్డి, ఎం.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శులుగా డి.బాలకృష్ణారెడ్డి, వి.సుబ్బరాయుడు, ఆర్.నాగ, జి.జగదీశ్వరరెడ్డి, కార్యదర్శులుగా అలీయా బేగం, జె.నాగరాజు, ఎస్.రమేష్, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, జి.శేషానందారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గోవిందరాజులు, చిన్న పెద్దన్న, ఎం.ఎర్రినాగప్ప, కె.రాజు, ప్రభాకర్‌రెడ్డి, ఆర్.అప్పి(నాగరాజు), డి.దానయ్య, దసరా బుల్లోడు, ఎస్.రామాంజనేయులు, ఎస్.నాగరాజు, ఎస్.భాస్కర్‌రెడ్డి, కె.రఘు, శ్రీనివాసరెడ్డి, బి.చిన్నరాజు, బి.రాంమోహన్, జి.అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్.మనీషారెడ్డి, శేఖర్‌రెడ్డి, బి.కొండయ్య, ఆర్.మల్లేసు, బి.భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బి.పురుషోత్తం, జె.లక్ష్మీనారాయణను నియమించారు. అలాగే బుక్కరాయ సముద్రం మండల యువజన విభాగం అధ్యక్షుడిగా పూల రంగ, మహిళ విభాగం అధ్యక్షురాలిగా కల్పనరెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడిగా జయరామిరెడ్డి, బీసీ సెల్ విభాగం అధ్యక్షుడిగా సి.ఆదినారాయణ, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడిగా బి.మారుతి, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా జి.పెద్దన్న, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఈ.సుశీలమ్మ, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కె.సాయికుమార్, ఆర్‌టీఐ వింగ్ విభాగం అధ్యక్షుడిగా ఎం.రంగనాథ్, వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా ఎం.రవికుమార్ , చేనేత విభాగం అధ్యక్షుడిగా రంగస్వామి, వైఎస్ఆర్‌టీయూసీ విభాగం అధ్యక్షుడిగా కె.ఆదినారాయణ, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా బి.ఈశ్వరయ్య, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా పవన్ సాయి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా డి.ఎర్రిస్వామిని నియమించారు.

ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధం


మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి నియోజకవర్గ ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. తాడిపత్రికి వెళ్లేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఆయన ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పోలీసులతో కలసి తనను అడ్డుకోవడమే కాకుండా తాడిపత్రిని జూదకేంద్రంగా మార్చారన్నారు. తాడిపత్రి పట్టణంలో టీడీపీ నాయకులు మట్కా , పేకాట కేంద్రాలను విచ్చలవిడిగా నడుపుతూ ప్రజలను నిలువునా దోచుకుంటున్నారన్నారు. పట్టణ వీధుల్లో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారన్నారు. త్వరలో తాడిపత్రికి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లవచ్చన్న సుప్రీం కోర్టు తీర్పుపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు తాడిపత్రి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే తమ నాయకుడు తాడిపత్రి వస్తున్నారన్న సమాచారంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ సమస్యలపై ప్రశ్నించిన వారిపై టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి రాకపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ముగిసిన హజరత్ సయ్యద్ ఖాద్రీ ఉరుసు

యల్లనూరు: మండలంలోని పెద్దమల్లేపల్లి సమీపంలోని హజరత్ సయ్యద్ ఖాద్రీ ఉరుసు శుక్రవారం ముగిసినట్లు దర్గా పీఠాధిపతులు సయ్యద్ జిలానీ బాష ఖాద్రీ, అభానిబాషా ఖాద్రీ తెలిపారు. ఆఖరిరోజు జియారత్ కార్యక్రమం జరిగిందన్నారు. ఉత్సవాలకు ముస్లిం మత పెద్దలు, కులస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


గుత్తి ఆర్ఎస్‌లో నిమజ్జనానికి తరలివెళ్తున్న భారీ గణనాథుడు


పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి కుంటలో వినాయక నిమజ్జనం చేస్తున్న దృశ్యం


గుత్తిలో విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్/గుత్తి/పామిడి/శింగనమల/యల్లనూరు/గార్లదిన్నె/పెద్దవడుగూరు: తాడిపత్రి, పెద్దపప్పూరు మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల్లో వున్న వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ట్రాక్టర్లలో గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు, చిన్నారుల డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేశారు. గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలతో మార్మోగించారు. మండపాల వద్ద అన్నదానం చేశారు. అనంతరం తాడిపత్రి మండలంలో ఆలూరు కుంటలో, పెద్దపప్పూరు మండలంలోని చీమలవాగుపల్లి కుంటల్లో నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ ధరణి, పెద్దపప్పూరు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

▸▸ గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లతో పాటు ఎస్ఎస్ పల్లి, చెట్నేపల్లిలో శుక్రవారం గణనాథుల నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే ఉత్సవాలు కొనసాగాయి. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో సుమారు 100 వినాయకులను ప్రతిష్టించారు. ఇందులో సుమారు 80 శాతం నిమజ్జనం చేశారు. మిగతా 20 శాతం ఆదివారం నిమజ్జనం చేయనున్నారు. గుత్తి చెరువు, తురకపల్లి కుంట, లచ్చానపల్లి వంక, ఎస్ఎస్ పల్లి చెరువు తదితర ప్రాంతాల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సురేష్, గౌతమ్, ఏఎస్ఐలు నాగమాణిక్యం, రామాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

▸▸ గుత్తి మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. విగ్రహాలను గ్రామ శివారులోని కుంటల్లో నిమజ్జనం చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ బందోబస్తు నిర్వహించారు.

▸▸ పామిడిలో శుక్రవారం సాయంత్రం గణేష్ విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

▸▸ శింగనమల మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శింగనమల, శివపురం, కొర్రపాడు, చెదుల్లా, నీలాంపల్లి, మదిరేపల్లి, ఆకులేడు, గురుగుంట్ల, చిన్నజలాలపురం, నాగులగుడ్డం, తండా, వెస్ట్ నరసాపురం గ్రామాలో వినాయక విగ్రహాలను శింగనమల చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే గోవిందరాయునిపేట, సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం , రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, కల్లుమడిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

▸▸ యల్లనూరు మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శుక్రవారం వినాయక విగ్రహాలను యల్లనూరు సమీపంలోని చిత్రావతి నదిలో, విగ్రహాలు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. పుట్లూరు సీఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

▸▸ గార్లదిన్నె మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాలు శుక్రవారం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

▸▸ పెద్దవడుగూరు మండలంలోని 25 గ్రామ పంచాయితీలల్లో కొలువైన గణనాథుని విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేశారు. క్రిష్టిపాడు గ్రామంలో నిమజ్జన కార్యక్రమాన్ని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి పర్యవేక్షించారు. సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


పామిడిలో గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


శింగనమలలో వినాయక విగ్రహాలను ఊరేగిస్తున్న యువకులు


పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి.


యల్లనూరులో విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్లుతున్న దృశ్యం


నార్పల మండలం కురగానిపల్లిలో విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


పెద్దవడుగూరులో విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

నేలకొరిగిన వినాయక విగ్రహం

- ఇద్దరికి గాయాలు

పుట్లూరు: వినాయక నిమజ్జనం సందర్భంగా పుట్లూరు మండలం కుమ్మనమలలో అపశ్రుతి చోటు చేసుకుంది. శుక్రవారం నిమజ్జనానికి వినాయక ప్రతిమను తరలించేందుకు క్రేన్ సాయంతో ట్రాక్టర్‌లోకి ఎత్తుతున్న సమయంలో తాళ్లు తెగిపడ్డాయి. దీంతో విగ్రమం నేలకొరగడంతో శ్రీనివాసులు, నాగార్జున గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

యాడికి/పెద్దవడుగూరు: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తాడిపత్రి సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సూచించారు. యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మండల కేంద్రంలో శుక్రవారం ఆయన వైద్యాధికారి సుమం త్ రెడ్డితో కలిసి క్షేత్ర స్థాయిలో గృహాలను పరిశీలించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు డ్రైడే పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మండల కేంద్రంలోని పలు వీధుల్లో చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీర్రాజు, ఈఓపీఆర్డీ శశికళ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరు మండలంలోని మిడుతూరులో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి ఓబులు పర్యటించారు. గ్రామంలో రోహిత్‌కుమార్ అనే విద్యార్థికి డెంగీ నిర్ధారణ అవడంతో.. ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం డెంగీ, చికెన్ గన్యా, మలేరియా వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా షఫీ

గుత్తి: పట్టణానికి చెంది న దండియా మహమ్మద్ షఫీ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషనర్ అధ్యక్షుడు హాజి మహమ్మద్ ముజాహిద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఐ రాష్ట్ర కమిటీలో చోటు

గుంతకల్లు: సీపీఐ రాష్ట్ర కమిటీలో గుంతకల్లుకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. పట్టణానికి చెందిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉన్న బి.గోవిందును రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎంపిక చేయగా, జనసేన దళ్ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఉన్న మురళీకృష్ణను రెండోసారి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ఒంగోలులో జరిగిన సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలో తమను ఎన్నుకున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వీరభద్రస్వామి, పట్టణ, రూరల్ కార్యదర్శులు ఎస్.గోపీనాథ్, రాముడాయల్, సహాయ కార్యదర్శులు ఎస్ఎండీ గౌస్, రామాంజినేయులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గార్లదిన్నె: మండలంలోని సంజీవపురానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఓ యువతి శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చి సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాక పోవడంతో, కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కల ప్రాంతాలు, బంధువుల ఊర్లలో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

పోటాపోటీగా లడ్డూ వేలం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో వినాయక చవితికి ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ఉంచిన లడ్డూ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగుంట్లలో ఆర్డీటీ స్కూల్ వద్ద మల్లికార్జున రూ.21,200 వేలు, ముత్యాలమ్మ గుడి వద్ద పూజారి ఓబిలేసు రూ.16 వేలకు వేలం పాడి లడూ సొంతం చేసుకున్నారు.

గుత్తి: గుత్తిలోని బండగేరిలో వినాయకుడి లడ్డూను శుక్రవారం వేలం పాట నిర్వహించారు. బండగేరికి చెందిన ఆర్‌బీ శశి రూ. 1.05 లక్షలకు లడ్డు దక్కించుకున్నాడు.

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో శుక్రవారం వినాయకుడి లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన మార్కెట్‌యార్డు చైర్మన్ సూర్య ప్రతాప్ రూ.69 వేలకు దక్కించుకున్నారు.

నిషేధిత గడ్డి మందు పట్టివేత

గార్లదిన్నె: మండలంలోని గుడ్డాలపల్లిలో నిషేధిత గ్లైఫోసెట్ గడ్డి మందు రైతులకు విక్రయిస్తుండడంతో శుక్రవారం వ్యవసాయ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. వ్యవసాయ శాఖ అనంతపురము ఏడీ అల్తాఫ్ అలీఖాన్ మాట్లాడుతూ 10 లీటర్లు గ్లైఫోసెట్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో గార్లదిన్నె ఇన్‌చార్జ్ ఏఓ సాయిలక్ష్మి, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు సమాచారం ఫార్వర్డ్ చేస్తే చర్యలు

తాడిపత్రి రూరల్: శాంతిభద్రతలకు భంగం కలిగించే సమాచారాన్ని ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. బలవంతపు మతమార్పిడులు, తిరగబడ్డ వెంకటాంపల్లి గ్రామస్తులు అన్న తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన సంఘటనను ప్రస్తుతం జరిగినట్టు ఫార్వర్డ్ చేయడం మంచిది కాదన్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తూ సోషల్ మీడియా, వాట్సాఫ్ తదితర వాటిల్లో ఫార్వర్డ్ చేయరాదని సీఐ కోరారు.